# సంపాదకీయము

ప్రాణాహుతి సహిత ధ్యానమును మనకందించి, నిరంతరము ప్రాణాహుతిని పొందు అవకాశము కల్పించిన, మన ఆదిగురుదేవులు, సమర్థగురు శ్రీ రామచంద్రజీ మహారాజ్ (పూజ్య లాలాజీ మహారాజ్) వారి 135వ జన్మదినము మనందరకు శుభప్రదమైనది. ప్రతి సంవత్సరము ఇటువంటి శుభకరమైన దినములో మనందరము సమావేశమగుట, మన ఆధ్యాత్మిక విధిగా భావించవలెను. బ్రిటిష్ దొరల పాలనలో వారి రాజకీయ, ఆర్థిక విలువల ప్రభావముతో సనాతన ధర్మమునకు పుట్టినిల్లైన భారతావనిలో ఆధ్యాత్మికత మరుగున పడినది. అందువలననే భారతదేశ చరిత్రలోని ఆ సమయమును అంధకారమైన కాలముగా అభివర్ణించెదరు. పరిపాలకులకు అనుకూలముగా కపటముతో కూడిన తెలివితో మాట్లాడు వారు ఆ రోజులలో మిక్కుటముగా నుండిరి. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకముగా చేయు పోరాటమును, తిరుగుబాటుగా ఆరోజులలో అభివర్ణించినారు కాని, అది స్వాతంత్ర్యము కొరకు మనము చేసిన పోరాటము.

భారతదేశమును బ్రిటిష్ పాలకుల దాశ్య శృంఖలములనుండి విముక్తి కలుగజేసి స్వాతంత్ర్యమును కలుగజేయుటకు అనేకమంది పోరాటము మన జీవన పరిస్థితులను మెరుగుపరుచుకొని బ్రిటిష్ విధానములనుండి వారి బానిసత్వమునుండి బైటపడవలెనని చెప్పినారు. కాని మానవునిలోని ఆధ్యాత్మిక దాహమును తీర్చుకొను కోరికగల సాధకులకు, వారి దాహార్తిని తీర్చు శక్తిగల సమర్థులు కరువైనారు. అతి వున్నత మానసిక సంపన్నులు భారతావనిలో ఉదయించి, దానికి తిరిగి పూర్వపు వైభవము తీసుకొని వచ్చుటయేకాక, ప్రపంచమంతటికి దివ్యజ్యోతిని చూపు మహోన్నతులు రాబోవు కాలములో అవతరించెదరని ఆధ్యాత్మికతలో మూల పురుషులు, యిప్పటికీ మార్గదర్శకులు అయిన స్వామి వివేకానందులు నమ్మకము కలిగియుండిరి. అటువంటి తరుణములో ప్రకృతిశక్తి మానవరూపములో, సమర్థ గురుదేవులు మహాత్మ రామచంద్రజీ మహారాజ్‌గా (లాలాజీ మహారాజ్), శక సంవత్సరము 1794, మాఘమాసం బసంత్‌పంచమి (1873 ఫిబ్రవరి 2వ తేదీ) శుభదినమున హృదయమంతయు భక్తిభావముతో పరిపూర్ణముగా నిండి, దైవసాన్నిధ్యములో గడుపు పవిత్రమైన మాతృగర్భమున, ఒక దివ్యపురుషుని ఆశీర్వాద ఫలితముగా జన్మించినారు. మహాత్ములు ఊరకనే రారు. ప్రకృతిలో సమతుల్యత లోపించినపుడు దానిని చక్కదిద్దు కార్యమునకు వారు మానవ జన్మ నెత్తెదరు. వారు కారణ జన్ములు. వారి రాకతో ఆధ్యాత్మికతలో నూతన శకము ప్రారంభమైనది.

ప్రకృతిచే మానవులకు ప్రసాదించబడిన విశిష్ట గురుదేవులైన పూజ్య లాలాజీ మహారాజ్,

మరుగునపడిన ప్రాణాహుతిని పునరుద్ధరించి, సాధకునియొక్క భారమును యించుమించు పూర్తిగా ఉపశమనము కలిగించు ఒక సరికొత్త సాధనా విధానమును అందించినారు. వారు తమ భౌతిక శరీరమును విడుచుటకు ముందు అనారోగ్యముతో బాధపడుచున్న సమయములో వారి ప్రతినిధి గురించి వారి ముఖ్య శిష్యులు ప్రశ్నించినపుడు, "రామచంద్రుడు కుటుంబము యొక్క వెలుగవునని" ఒకసారి సమాధానమిచ్చినారు. మన పూజ్య గురుదేవులైన షాజహాన్‌పూర్ వాస్తవ్యులు శ్రీ రామచంద్రజీ మహారాజ్ గారు తమ స్వీయ చరిత్రలో తనకు వచ్చిన కలను గురించి వ్రాయుచు "పూజ్య లాలాజీ గారు కలలో కనబడి తనలో ఐక్యమవుతూ, నేను నీవైనాను మరియు నీవు నేనైనావు, నేను శరీరమైతే నీవు ఆత్మవు, దీని పిదప నీవు నేను వేరని ఎవ్వరు అనలేరు అని చెప్పినారు" అని వ్రాసుకున్నారు.

పూజ్య లాలాజీ మహారాజ్, మన గురుదేవులైన పూజ్య బాబూజీ గారిని విశిష్టమూర్తిమత్వముగా మలిచి, మనకు సేవలందించుచు, మనము కోరినవెంటనే మన హృదయములో ప్రవేశించుటకు అవకాశము కల్పించినారు. మన గురుదేవులైన పూజ్య బాబూజీ మహారాజ్ తమ గురుదేవుల శతాబ్ది సందర్భముగా యిచ్చిన సందేశములో "మనము సదా గురుదేవులలో జీవించుటకు ఈ సందర్భమును వినియోగించుకొనవలెను. ఇది మన ఆధ్యాత్మికోన్నతిలో ఎంతగానో ఉపయోగపడునని" మనకు ప్రబోధించినారు. గురుదేవుల సందేశానుసారము మనము ఈ విశిష్టమైన సమయమును వారి స్మరణలోనే గడుపుతూ ఆధ్యాత్మికముగా ఉన్నత దశలకు పురోగమించుటకు యత్నించెదము. పూజ్య గురుదేవుల కృప మనందరికీ కలగాలని ఆశిస్తున్నాము

- వి.రామం